క్లుప్తంగా

అలరించిన సంగీత విభావరి



సంకీర్తనలు ఆలపిస్తున్న సురేఖ హెగ్డే, అర్చన కులకర్ణి

మంత్రాలయం : చాతుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీమఠం సౌజన్యంతో హరికథ పారాయాణం, దాస సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం శ్రీమఠం ప్రవచన మందిరంలో దాస సంగీత విభావరి చేపట్టారు. బెంగళూరుకు చెందిన శ్రీమతి అర్చన కులకర్ణి, శివమొగ్గకు చెందిన శ్రీమంతి సురేఖ హెగ్డే సంగీత కచేరి అలరించింది. ఇందులో వెంకటనాథుడు, శ్రీకృష్ణుడు, శ్రీరామచంద్రుడు, రాఘవేంద్రుల కీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుసార్వభౌమ దాస సాహిత్య ప్రాజెక్ట్ బాధ్యులు పద్మనాభాచార్, నరహరి, ప్రాణేష్ ఆచార్ పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు చేపట్టండి

ఆదోనిటౌన్ : కాలనీల్లోని మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టి మురుగు ముందుకెళ్లేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ఖాజీగడ్డ ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఏఈలు, స్థానికులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. రెండు మూడు రోజులక్రితం కురిసిన వర్షాల కారణంగా ముగురు కాలువలు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందికరంగా మారి, కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి మురుగునీటితో నిండిపోయి ఉండటంతో వెంటనే తొలగింపు పనులు చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. చిన్న శక్తిగుడి ఏరియాలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఎంఐజీ ట్యాంకు వద్ద వర్కర్ల మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఎంతమంది విధులకు హాజరయ్యారు, ఎంతమంది గైర్హాజరయ్యారన్న అంశాన్ని ఏఈలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను డాక్టర్ సనాఖాన్ బాను, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు పంపిణీ చేశారు. గురువారం స్థానిక టీబీ క్లీనిక్‌లో 11 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు రూ.వెయ్యి విలువజేసే మొత్తం 11 కిట్లను పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ పది మంది వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారని డాక్టర్ సనాఖాన్‌భాను తెలిపారు. ఆరు నెలలపాటు వారికి అవసరమైన సరుకులను ఆయన సమకూరుస్తారని చెప్పారు.

అన్నదానం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్య అన్నదానం కేంద్రంలో గురువారం కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలూకా ముదుగుప్ప గ్రామానికి చెందిన బాబమ్మ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ముందుగా మాబుసాబ్ కుటుంబ సభ్యులు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, కౌతాళం జెడ్పీ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వడ్డే రాము, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

ఆదోనిసెంట్రల్ : ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోని ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్ఎఫ్) డివిజన్ సహాయ కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా పుస్తకాలను అమ్ముతున్నారని, నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.20 వేల నుంచి రూ.90 వేల వరకు అదనపు సెక్షన్లు నిర్వహించి ఫీజులు దండుకుంటున్నారని ఆరోపించారు. సబ్‌కలెక్టర్ స్కూళ్లను సందర్శించి అక్రమాలపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మహేష్, పవన్, రాము, విష్ణు, మోహన్, వర్దన్ పాల్గొన్నారు.

పురాతన కట్టడాల్లో నిర్మాణాలు చేపట్టరాదు



షాహి జామియా మసీదు వద్ద మాట్లాడుతున్న రంజిత

ఆదోనిసెంట్రల్ : పురాతన కట్టడాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, మరమ్మతులు చేయరాదని పురావస్తు శాఖ సహాయ డైరెక్టర్ రంజిత తెలిపారు. గురువారం పట్టణంలోని పురాతన షాహి జామియా మసీదును పరిశీలించారు. అప్పటి నిర్మాణం, కట్టడంపై మసీదు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం షాహి జామియా మసీదు పురావస్తు శాఖ పరిధిలో లేదని, కొందరు స్థానికులు మసీదులో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని తమకు ఫిర్యాదు చేయడంతో పరిశీలించామని చెప్పారు. మసీదు 16వ శతాబ్దంలో నిర్మించారని, నివేదికను సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు అందజేస్తామని తెలిపారు.

తగ్గితే ఓడినట్లు కాదు..

- గెలవడం కన్నా క్షమించడం గొప్ప
- 281లో 55 కేసులు రాజీ
- రేపు జాతీయ మెగా లోక్‌అదాలత్

తగ్గితే ఓడినట్లు కాదు.. అందరి మనస్సులు గెలిచినట్లు. గెలవడం కన్నా క్షమించడం గొప్ప. రాజీ పడటం అంటే క్షమించడం. రాజీ అయ్యావంటే ఓడినట్లు కాదు. నీవు మనస్సున్న మహారాజువి అని అర్థం. రాజీ మార్గమే రాజమార్గం.' కేసుల్లో రాజీ అవుదాం.. మన ఊరిని ప్రశాంతంగా ఉంచుదాం' అంటూ సుప్రీంకోర్టు చిన్నచిన్న కేసులకు రాజీ మార్గం అవకాశం ఇవ్వడంతో పోలీసులు ఫిర్యాదుదారులు, కక్షదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి రాజీమార్గం వైపు మళ్లిస్తున్నారు.

ఆదోనిఅర్బన్ : ఫ్రెండ్లీ పోలీసింగ్ సత్ఫలితానిస్తుంది. ఆదోని నియోజకవర్గంలోనున్న ఏడు పోలీస్‌స్టేషన్‌ల నుంచి కోర్టు పనులు చూసేందుకు ఒక కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఉన్నారు. వీరిలో అధిక శాతం మంది ఉన్నత విద్యావంతులు. చట్టాలపై సంపూర్ణ అవగాహన ఉన్నవారే. పోలీసు అధికారుల సూచన మేరకు కోర్టు పనులు చక్కబెడుతున్నారు. కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. కోర్టులు, పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచిస్తున్నారు. ఇరువర్గాల వారికి వారి తప్పులను ఎత్తి చూపుతారు. అధర్మం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తారు. తప్పు ఎక్కడ జరిగిందో ప్రాథమికంగా గుర్తించి పోలీసు అధికారులకు తెలియజేస్తున్నారు. కౌన్సెలింగ్ ఇప్పించి ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ తదితర వేలాది కేసుల పరిష్కారానికి తెర వెనక సూత్రధారులుగా రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే ఇటీవల కాలంలో రాజీ కేసుల సంఖ్య అమాంతంగా పెరిగిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సహకరిస్తున్న సచివాలయ మహిళా పోలీసులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవడంతో కోర్టు పనులు మరింత సులభతరమయ్యాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. తరచూ వివాదాలకు పాల్పడే వారి పూర్తి సమాచారం సేకరణలో సచివాలయ మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కేసుల్లో ఇరువర్గాల వారిని సమావేశ పరిచేందుకు, స్టేషన్ నుంచి సకాలంలో సమాచారం ఇచ్చేందుకు సహాయపడుతున్నారు. రాజీ యత్నాల్లో కూడా వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. నేరగాళ్ల ఉనికిని తెలియజేస్తూ నేర నియంత్రణకు సహకరిస్తున్నారు.



ఫిర్యాదుదారుడు, కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్

రాజీ పడే కేసులు..

సీఆర్‌పీఎస్ 320 చట్టం కింద రాజీపడే కేసులు .. 323, 334, 335, 341, 342, 343, 344, 346, 352,403, 407, 411, 414, 417, 506 ఈ సెక్షన్ల కింద ఉన్న కేసులు మాత్రమే రాజీపడే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

రాజీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తాం



చిన్నచిన్న కేసులు, తగాదాల విషయంలో ఇరువర్గాల మేలు కోసమే సుప్రీం కోర్టు రాజీ పడేందుకు అవకాశమిచ్చింది. ఇందుకోసం శనివారం జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాటు చేశారు. ప్రతి కేసును రాజీ చేసేందుకు ఇరువర్గాల్లో అవగాహన కల్పిస్తున్నాం. రాజీ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం. ఫిర్యాదుదారుడు రాజీ అయ్యేందుకు అంగీకరిస్తే ఆ కేసు వివరాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తాం. ఫిర్యాదుదారుడు అంగీకారం మేరకే లోక్‌అదాలత్‌లో రాజీ కుదురుతుంది. లేదంటే కేసు కొనసాగుతుంది. ఇప్పటివరకు 281 ఉన్న కేసుల్లో 55 కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ కావడానికి ఒప్పుకున్నారు. మిగిలిన రెండు రోజుల్లో మరిన్ని కేసుల రాజీ కోసం ప్రయత్నిస్తాం.

– శివనారాయణస్వామి, ఆదోని డీఎస్పీ

కేసు వల్ల పడే ఇబ్బందులను వివరిస్తాం



ఇరువర్గాల వారితో స్నేహంగా ఉంటూ వారి కష్టసుఖాలు, సమస్యలు తెలుకుంటాం. కేసుల వల్ల పడే ఇబ్బందులు, కష్టనష్టాలు, తప్పులను ఇరువర్గాల వారికి తెలియజేసి, రాజీ వల్ల కలిగే మేలును వివరిస్తాం. దీంతో ఫిర్యాదుదారుడికి క్షమాపణ చెబుతారు. కేసును విత్ డ్రా చేసుకునేందుకు ముందుకొస్తారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి సమక్షంలో రాజీ కుదురుతుంది.

– చంద్ర, టూటౌన్ ఎస్ఐ

సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

ఆదోనిటౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల దరిచేరేలా చూడాలని పొదుపు సంఘాల మహిళలు, రిసోర్స్‌పర్సన్‌లకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత సూచించారు. మెప్మా ప్రాజెక్టు అధికారిణి సనాభాను ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయంలో ఆర్‌పీలు, పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కొందరు ఆర్‌పీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందని, అలాంటి విధానాలకు స్వస్థిపలికి జగనన్న అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులకు అందజేయాలని చెప్పారు.పథకాలపై వార్డుల్లో ప్రచారం చేస్తూ ప్రజల కు అవగాహన కల్పించి మిగిలిపోయిన అర్హులను గుర్తించి అందజేయాలని కోరారు. వైస్ చైర్మన్ నరసింహులు, వీరారెడ్డి, ఆర్‌పీలు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం



ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోనిసెంట్రల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డులు తీసుకున్న ఇండిపెండెంట్ ఎస్ఏ పద్మావతిని గురువారం స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పురపాలక పాఠశాల హెచ్ఎం కె.మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పాఠశాల తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వినాయక చవితిని శాంతియుతంగా జరుపుకోవాలి





మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్,హాజరైన ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు

ఆదోనిరూరల్ : డివిజన్‌లో వినాయక చవితి పండగను శాంతియుతంగా జరుపుకోవాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కోరారు. గురువారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గణేష్ చతుర్థి పండగ ముందస్తు ఏర్పాట్లపై అధికారులు, గణేష్ కమిటీ, విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకోవాలని సూచించారు. గణేష్ శోభాయాత్ర నిర్వహించే మార్గాల్లో రహదారులు మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో పండగను విజయవంతం చేయాలని చెప్పారు. నిమజ్జనానికి ఒక రోజు ముందే మద్యం దుకాణాలు మూసివేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలన్నారు. గణేష్ మండపాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గణేష్ మండపానికి ఒకరు లేదా ఇద్దరిని ఇన్‌చార్జ్‌లుగా నియమించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. నిమజ్జన స్థలాల్లో లైటింగ్, బారికేడ్‌లు, ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎస్పీలు శివనారాయణస్వామి, సీతారామయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్‌లు వెంకటలక్ష్మి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.







ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీకృష్ణుడు,రథోత్సవం ముందు గొరవయ్యల ప్రదర్శన, రథోత్సవం ముందు కోలాటం ఆడుతున్న బాలికలు

ముకుందా.. మురారీ

- పట్టణంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు
- హరే కృష్ణ నామస్మరణతో మార్మోగిన పట్టణం



ఉట్టికొడుతున్న ఎస్ఐ సతీష్ కుమార్



రథోత్సవం ముందు శ్రీకృష్ణ, ఆంజనేయ, గోపికలు తదితర వేషధారణలో చిన్నారులు

ఆదోనిఅర్బన్ : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గురువారం పట్టణంలోని కార్వన్‌పేటలో వెలిసిన శ్రీ కృష్ణుడికి విశేష పూజలు జరిగాయి. హరే కృష్ణ..నామ స్మరణతో పట్టణం మార్మోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాభిషేకం, తులసీ, కుంకుమార్చన, గోపూజ, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం పుర వీధుల్లో నిర్వహించిన రథోత్సవానికి పట్టణంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో పట్టణం కిటకిటలాడింది. ఆలయ నుంచి ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న లక్ష్మమ్మవ్వ ఆలయం వరకు రథాన్ని లాగి తిరిగి శ్రీకృష్ణ ఆలయానికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా చిన్నారులు కలశాలతో రథం ముందు నడిచారు. అలాగే గొరవయ్యల నృత్యాలు, బాలికల కోలాటాలతోపాటు డోలు సన్నాయిల మధ్య రథోత్సవం రమణీయంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో రథోత్సవం జరిగే ప్రాంతంలో ట్రాఫిక్‌ను మళ్లించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోసిగి: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని చౌడేశ్వరి దేవి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల కృష్ణుడు, గోపికల వేషాధారణలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎస్ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు. చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు ఆదిశేషులు,వెంకోబ పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు





పూజలందుకుంటున్న ఈరన్న స్వామి, దర్శనానికి క్యూకట్టిన భక్తులు

కౌతాళం : శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా నాల్గవ గురువారం సందర్భంగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి భక్తుల పోటెత్తారు. మూడవ సోమవారం అనంతరం వచ్చే గురువారం రోజు స్వామి వారిని దర్శించుకుంటే అంతే మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి సన్నిధిలో పూజలు, అభిషేకాలు చేపట్టారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.భక్తుల సౌకర్యార్థం దేవాలయ అధికారులు శ్రీఘ్ర దర్శనం, అతి శ్రీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనాల ద్వారా సౌకర్యం కల్పించడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనం సాఫీగా సాగింది.తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాత సేవ, మహా మంగళహారతి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నివాళి

కోసిగి: మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త హోటల్ బసిరెడ్డి (55)అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే తరఫున వై.ప్రదీప్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృత దేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

తుంగభద్ర తీరంలో భక్తుల సందడి



మంత్రాలయం: మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నది సందడిగా మారింది. శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కొద్ది రోజులుగా తుంగభద్ర నదిలో నీరు లేక బోసిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రస్తుతం నదిలో వరద నీటి ప్రవాహం ఉండటంతో రద్దీ కొనసాగుతుంది.

తుంగభద్ర నదిలో మహిళ గల్లంతు



సరస్వతి(ఫైల్)

నందవరం : మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో గురువారం విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. జోహరాపురం గ్రామానికి చెందిన కురవ బీమేష్ భార్య కురవ సరస్వతి తుంగభద్ర నదిలో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలి జారీ నీటిలో పడిపోయింది. ఉదయం 11 గంటల సమయంలో సరస్వతి మామ వెంకటప్పకు చెప్పి బట్టలు ఉతకడానికి నదికి వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలైనా తిరిగి రాకపోడంతో వెంకటప్ప తన బంధువైన రామప్పను నదికి వెళ్లి చూసి రామన్నాడు. దీంతో రామప్ప నదికి వెళ్లి చూడగా బట్టలు మాత్రం నదిలో గుండుపై ఉన్నాయని, సరస్వతి కనిపించడం లేదని తెలిపాడు. దీంతో వెంకటప్ప నదిలోకి వెళ్లి గాలించినా ఆమె కనిపించలేదు. దీంతో గ్రామస్తులకు, పోలీసులకు సమచారం అందించారు. పోలీసులు, గ్రామస్తులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల వరకు వెతికినా జాడ కనిపించలేదు. ఎస్ఐ తిమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సరస్వతి ఏడు నెలల బాలింతరాలు ఈమెకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సిటిజన్ సర్వే వేగవంతం చేయండి

హొళగుంద: సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ నాగేశ్వర రావు సూచించారు. హొళగుందలోని సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం డీఎల్‌డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా.. ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నారా అని సర్వే చేయాలన్నారు. అలాగే హౌసింగ్ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని చెప్పారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం




పట్టుబడిన కర్ణాటక మద్యం, స్వాధీనం చేసుకున్న కారు, బైక్

పెద్దకడబూరు: మండలంలోని ముచ్చుగిరి ఫారెస్ట్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి సర్కిల్ సెబ్ సీఐ సృజన్ బాబు తెలిపారు. గురువారం సెబ్ పోలీసులతో కలిసి ముచ్చుగిరి ఫారెస్ట్‌లో తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన చెన్నబసవ కారు, బైక్‌లో మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 35 బాక్స్‌ల్లో 90 ఎంఎల్ ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయన్నారు. మద్యం తరలించేందుకు ఉపయోగించిన ఇండికా కారు, బైక్‌ను సీజ్ చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

ఆదోనిరూరల్ : పట్టణంలోని అమరావతినగర్‌లో బోయ కాసమ్మ అనే మహిళ 22 కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు.

పటిష్టమైన ఓటరు జాబితా రూపొందిస్తాం

- నూతన ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్
- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : ఓటరు జాబితా ఇంటింటి సర్వే 99.70 శాతం పూర్తయ్యిందని, 2,51,573 ఓటర్లకుగానూ 2,50,821 మంది ఓటర్‌ల సర్వే పూర్తి చేశామని, స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా చేపడతామని, లోపాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను జనవరి 5వ తేదీ నాటికి ప్రచురించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఎల్‌పీఓ శ్రీనివాసులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సబ్‌కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే, స్పెసల్ సమ్మరీ రివిజన్–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూశామన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహిస్తామన్నారు. ఏఈఆర్వో, బూత్ లెవెల్ అధికారులకు ఇప్పటికే స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. నూతన ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిని తనిఖీ చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చైతన్యకుమార్

ఆదోనిఅర్బన్ : విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలని ఏరియా ఆస్పత్రి మానసిక వైద్యనిపుణులు డాక్టర్ చైతన్యకుమార్, సైక్రియాటిస్ట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం స్థానిక విశ్వనారాయణ కళాశాలలో ఈనెల 10వ తేదీన జరిగే ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకాలజిస్టు ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకుఅవగాహన సదస్సు నిర్వహించారు. శారీరక బలహీనతలు మానసికంగా దెబ్బతీస్తాయని, పరీక్షల్లో ఫెయిలవ్వడం, ఉద్రేకం, కోపం, చిరాకు అధికమై ఆత్మహత్యలకు పాల్పడతారని చెప్పారు. వీటి నివారణకు.. వ్యాయామం, యోగా చేయాలని సూచించారు.